క్లుప్తంగా

రైతు బజార్‌లో 140 స్టాళ్లకు డ్రా



డ్రా తీసిన స్టాల్ నంబర్ టోకెన్ ఇస్తున్న ఏవో కృష్ణమూర్తి

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులో సోమవారం మొత్తం 140 స్టాళ్లకు డ్రా తీశారు. అనంతరం రైతు బజార్ ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి రైతులకు టోకెన్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతివారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. రైతులు విధిగా వారికి కేటాయించిన స్టాళ్లలోనే విక్రయాలు చేయాలని సూచించారు.

శిశుగృహ సందర్శన



రికార్డులను తనిఖీచేస్తున్న చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు పద్మావతి

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలో ఉన్న శిశుగృహను రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి సోమవారం సందర్శించారు. శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. పలు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సమీపంలో ఉన్న నరేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి చిన్నారుల మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. చిన్నారుల జనన సర్టిఫికెట్లు జారీ చేయడంలో నిర్లక్ష్యం వద్దన్నారు. ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో ఎంవీ రమణకుమారి, భీమిలి సీడీపీవో శ్రీదేవి, శిశుగృహ మేనేజర్ సుజాత, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు శారదా దేవి, లోవలక్ష్మి పాల్గొన్నారు.

ఈకోర్సా పరాజయం

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ కప్ టీ20 క్రికెట్ ప్రారంభ మ్యాచ్‌లో ఈకోర్సా వాల్తేర్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గాజువాక గ్రీన్స్ చేతిలో పరాజయం పాలైంది. మరో మ్యాచ్‌లో వైజాగ్ వెటరన్స్ సీసీ 67 పరుగులతో సైమండ్స్ బ్లూస్‌పై విజయం సాధించింది. రైల్వే స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఈకోర్సా 94 పరుగులకే ఆలౌటైంది. దీపక్ కుమార్ 37 పరుగులు చేయగలిగాడు. సిద్ధార్థ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా గాజువాక గ్రీన్స్ 12.5 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. మహీప్‌కుమార్ 44 పరుగులతో నిలిచి జట్టుకు విజయాన్నందించాడు. జింక్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో వైజాగ్ వెటరన్స్ మూడు వికెట్లకు 227 పరుగులు చేసింది. రిత్విక్ 124 పరుగులతో నిలవగా శ్యామ్ 66 పరుగులు చేశాడు. ప్రతిగా సైమండ్స్ బ్లూస్ మరో పది బంతులుండగానే 160పరుగులకు ఆలౌటైంది.

చికెన్ షాపులు వెలవెల

సీతమ్మధార : బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి. విశాఖ చికెన్ మార్కెట్ తీవ్ర నష్టాలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ ఫిష్ మార్కెట్ మీద పడింది. చేపలకు గిరాకీ ఏర్పడింది. ఫిష్ మార్కెట్లన్నీ కళకళలాడుతున్నాయి.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయాలని ఆలయ అధికారులు తెలిపారు.

నిరుపయోగంగా ట్రాఫిక్ ఐలాండ్



ట్రాఫిక్ ఐలాండ్

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 14వ వార్డులోని బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రాంతంలోని ట్రాఫిక్ ఐలాండ్ నిరుపయోగంగా మారింది. ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా లేకపోవడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. రాంగ్‌రూట్‌లో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా అరికట్టేవాడే కరువయ్యాడు. ట్రాఫిక్ ఐలాండ్ వద్ద కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అచ్చం ఘంటసాలలా..

యుగళ గీతమైనా, విషాద గీతమైనా, భక్తి గీతమైనా, ప్రేమగీతమైనా, హాస్య గీతమైనా సినిమాలో సందర్భానుసారంగా వచ్చే పాటలో భావోద్వేగాలను పలికించడంలో ఆయనకు ఆయనేసాటి. తేనెలూరు ఆ స్వరరాగ గంగా ప్రవాహంలో తడవని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తికాదు. తెలుగువారికి అమృతధార రస స్వర ఝరితో అపరిమిత గానామృతాన్ని పంచిన అమరగాయకుడు ఘంటసాల. ఆ గానామృతాన్ని తన గళంలో నింపుకుని 50 ఏళ్లుగా స్వరాభిషేకం చేస్తున్నారు విశాఖ ఘంటసాలగా పేరొందిన గల్లా చిట్టిబాబు. చిన్నతనం నుంచే ఘంటసాలకు ఆయన వీరాభిమాని. ఆయనలా పాడడం ప్రారంభించి..అచ్చం ఆయనే పాడుతున్నట్టు సాధన చేశారు. శ్రోతలను మెప్పిస్తున్నారు.


–తాటిచెట్లపాలెం

75 ఏళ్ల వయస్సులోనూ వన్నె తగ్గని గాత్రం



ఘంటసాల గీతాలు ఆలపిస్తున్న చిట్టిబాబు బృందం (ఫైల్)

ఘంటసాల గీతాలతో అలరిస్తున్న గల్లా చిట్టిబాబు



గాయకుడు గల్లా చిట్టిబాబు

గల్లా జగన్నాథరావు, రమణమ్మ దంపతులకు 1951 సంవత్సరంలో నాటి ఒడిశా రాష్ట్రంలోని ఖుర్దారోడ్ ప్రాంతంలో చిట్టిబాబు జన్మించారు. చిన్నతనం నుంచి ఘంటసాల పాటలు వింటూ పెరిగారు. ఆయన పాటలు పాడుతూ..గాయకుడిగా మారారు. చిన్న చిన్న కచేరీలతో ప్రారంభమైన తన ప్రస్థానం నేటికీ దిగ్విజయంగా కొనసాగుతోంది.

ఇతర రాష్ట్రాల్లోనూ...

ఈయన తండ్రి వృత్తి రీత్యా ఐదేళ్లు మధ్యప్రదేశ్‌లో ఉండడంతో అక్కడి తెలుగు సాంస్కృతిక సంఘాల ప్రోత్సాహంతో తెలుగు, హిందీ పాటలు పాడేవారు. క్రమేపి మహ్మద్ రఫీ పాటలను కూడా నేర్చుకున్నారు. ఆదేసమయంలో ఒడిషా, చత్తీస్‌ఘడ్, అస్సాం, వెస్ట్ బెంగాల్‌లలో తెలుగు, హిందీ పాటలు పాడేవిధంగా తనను తాను మలుచుకున్నారు. తదనంతరం తండ్రి విశాఖకు బదిలీకావడంతో అప్పటి నుంచి చిన్నచిన్న ప్రదర్శనల ద్వారా చిట్టిబాబు తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఘంటసాల పాటలు పాడుతూ శ్రోతలను అలరిస్తున్నారు. సంగీత రంగంలో ప్రముఖులైన ద్వారం భావనారాయణ, ఎంఎల్ నరసింహం వంటి వారు న్యాయ నిర్ణేతలుగా ఉన్న అనేక వేదికలపై ఎన్నో బహుమతులు అందుకున్నారు.

సొంత బృందం ఏర్పాటు చేసుకుని..

పాటల పోటీల్లో గెలుస్తూ, మరో వైపు గాయకుడిగా పలు సంగీత బృందాలతో కలిసి పని చేశారు. సాధనా ఆర్కెస్ట్రా, అరుణా ఆర్కెస్ట్రా, యువరాగ వర్ధిని సంగీత బృందం, స్వరసంగమం వంటి పలు బృందాల్లో పాటలు పాడుతూ అలరించారు. తదనంతరం సొంత బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నాట్యాచార్యులు ఎస్. మురళి ఆధ్వర్యంలో 36 గంటల నిర్విరామ నాట్య ప్రదర్శన, ఎస్ఎస్ కల్చరల్ క్రియేషన్ వారి 50 గంటల నాట్య ప్రదర్శనలలో నేపథ్యగానం అందించి ఆయా కార్యక్రమాలకు చిట్టిబాబు వన్నె తెచ్చారు. 1987లో నాటి కేంద్ర మంత్రి గౌతు లచ్చన్న వంటి ప్రముఖుల నుంచి ప్రశంసలు పొందారు.

ధ్యానమందిరంతో అనుబంధం...

రైల్వేన్యూకాలనీలోని రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబ ధ్యానమందిరంతో చిట్టిబాబుకు విడదీయరాని అనుబంధం ఉంది. ధ్యానమందిరం ప్రారంభమై 31 వసంతాలు పూర్తయితే సుమారు 30 ఏళ్ల నుంచి గల్లా చిట్టిబాబు ధ్యానమందిరం వద్ద భజన కార్యక్రమాలు చేపట్టేవారు. క్రమం తప్పకుండా గత 30ఏళ్లుగా ప్రతీ ఏడాది ఘంటసాల వర్ధంతి వేడుకలలో పాల్గొని తన గాత్రంతో భక్తులను, ఘంటసాల ప్రేమికులను అలరిస్తున్నారు.

ఆకాశవాణిలో..

గాత్ర కళాకారుడిగా భక్తి గీతాలు, ఘంటసాల పాటలు పాడుతూ 'ఘంటసాల గానసుధ' పేరున ప్రజాదరణ పొందిన చిట్టిబాబు, ఆకాశవాణి లలిత సంగీత గాయకుడిగా కూడా అర్హత సాధించారు. బీ గ్రేడు ఆర్టిస్టుగా ఉత్తరాంధ్ర శ్రోతలను 15 ఏళ్లపాటు అలరించారు. విశాఖ ప్రథమ మేయర్ ఎన్ఎస్ఎన్ రెడ్డి సమక్షంలో అనేక సార్లు పాడారు, కళాబంధు టి.సుబ్బిరామిరెడ్డిచే పలుసార్లు సత్కారాన్ని పొందారు.

ఆయన పాడుతుంటే ఘంటసాలే గుర్తుకువస్తారు



గల్లా చిట్టిబాబు అంటే గుర్తుకు వచ్చేవి ఘంటసాల పాటలు. భక్తి గీతాలు. 30 ఏళ్లుగా ధ్యానమందిరం వద్ద నిర్విరామంగా భజనలలో, భక్తిగీతాలు ఆలపిస్తూ భక్తుల ఆదరాభిమానాలను చూరగొన్నారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఘంటసాల వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తాం. ఈ వేడుకల్లో చిట్టిబాబు గాత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

–నూకల శేషగిరిరావు, ధ్యానమందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు

వారి ప్రోత్సాహం మరువలేను



ఘంటసాల అభిమానులు ఆదరణ ఎన్నటికి మరువలేను. 50ఏళ్లుగా ఘంటసాల పాటలు పాడుతున్నానంటే అది కేవలం ఆయన అభిమానుల ఆదరణే. ఎక్కడ ఘంటసాల భక్తిగీతాలను ఆలపించినా అధిక సంఖ్యలో అభిమానులు వచ్చి నన్ను ప్రోత్సహిస్తుంటారు. వారి ప్రోత్సాహంతోనే 75 ఏళ్ల వయస్సులో సైతం పాడగలుతున్నాను.

–గల్లా చిట్టిబాబు, ఘంటసాల గీతాల గాయకుడు

సేవా కార్యక్రమాల విస్తృతికి చర్యలు



మాట్లాడుతున్న భానుప్రకాష్

మురళీనగర్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల విస్తృతికి చర్యలు తీసుకున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో నిర్వహించిన వాకర్స్ క్లబ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి నెల నుంచి ప్రతి మూడో ఆదివారం సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈనెల 23న కేర్ ఆస్పత్రి సహకారంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. మార్చి 1న క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. మార్చి 8న మహిళా దినోత్సవం, 16న పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహిస్తామని చెప్పారు. పార్కు అభివృద్ధికి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును కలిసి నివేదించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాద్, పూర్వ అధ్యక్షుడు ఆర్.సత్యనాథం, ఎన్.బుచ్చయ్య పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులి పురుగుల నివారణ



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఏఎన్ఎంలు

సీతమ్మధార : జాతీయ నులిపురుగుల దినోత్సవం సోమవారంతో ముగిసింది. 24వ వార్డులో నక్కవానిపాలెం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను ఏఎన్ఎం కృష్ణవేణి వేయించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం మాట్లాడుతూ ఏడు నెలల నుంచి 19 ఏళ్ల వరకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం ఆయా కోమలిరెడ్డి పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు



గొల్లవీధిలో శిథిలమైన డ్రెయిన్ పైకప్పు



గురుద్వారా సమీపంలో గొల్లవీధిలో సంపూర్తిగా మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 25వవార్డు గొల్లవీధిలో మరమ్మత్తుల కోసం డ్రెయిన్లు తవ్వి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ప్రమాదకరంగా మారాయి. సీతంపేట రాధాకృష్ణ ఆలయం నుంచి గొల్లవీధికి వెళ్లే మార్గంలో డ్రెయిన్‌పై సిమెంట్ పలక పూర్తిగా శిథిలమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అలాగే గురుద్వారా కూడలి నుంచి గొల్లవీధికి వచ్చే మార్గంలో డ్రెయిన్ బ్లాక్ అయిందని మ్యాన్‌హోల్ ఏర్పాటు చేశారు. వారంరోజులుగా గడిచినా ఇంకా పనులు పూర్తి కాలేదు. అసంపూర్తి పనులతో నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. త్వరగా పనులు పూర్తి చెయ్యాలని కోరుతున్నారు.

వైభవంగా పార్వతీశ్వరుల కల్యాణోత్సవం



సీతంపేటలో ప్రత్యేక అలంకరణలో పార్వతీశ్వరుల ఉత్సవమూర్తులు



గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సీతంపేట: స్థానిక సీతంపేటలో దేవదాయశాఖ పరిధిలో గల పార్వతీశ్వరాలయంలో స్వామి వారి 35వ వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఈవో రమాభాయి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ నేతృత్వంలో పార్వతీశ్వరుల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. దీనిలో భాగంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, వాస్తుపూజ, అంకురార్పణ, ధ్వజారోహణ అగ్ని ప్రతిష్టాపన, ఆవరణాది హోమాలు నిర్వహించారు. సాయంత్రం గణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల నడుమ స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు మేళతాళాలతో స్వామి వారి సారె ఊరేగింపు జరుగుతుందని తెలిపారు.

రహదారులపై వాహనాల తిష్ట



పీఅండ్‌టీ కాలనీ రోడ్డుపై నిలిపివేసిన లారీ

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి 24వ వార్డు పరిధి సీతమ్మధార దరి పీఅండ్‌టీ కాలనీలోని భారీ భవనం నిర్మాణంలో ఉంది. కాంట్రాక్టర్ ఇక్కడ రాత్రి, పగలు తేడా లేకుండా పనులు చేయడంతో భారీ వాహనాలు సైతం రోడ్డుపైనే తిష్ట వేయడంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి పూట నిర్మాణ పనులు చేస్తుండడంతో పెద్దపెద్ద శబ్దాల కారణంగా నిద్రాభంగం కలుగుతోందని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా కార్మికశాఖ కూడా చూసీచూడనట్టే వ్యవహరించడంతో కార్మికులు సైతం నిద్రాహారాలు మాని పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు విమర్శిస్తున్నారు. ఇటు సీతమ్మధార కూడలి నుంచి, అటు గురుద్వారా కూడలి నుంచి వచ్చే వాహనాల రాకపోకలు ఈ రోడ్డుమీదుగానే జరుగుతాయి. దీంతో నిత్యం ఈ జంక్షన్ రద్దీగా ఉంటుంది. భవన నిర్మాణానికి మెటీరియల్ తెచ్చే వాహనాలు కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్న ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిత్యావసర సరకుల అందజేత



అనాథాశ్రమానికి నిత్యావసర సరకులు అందిజేస్తున్న మానవ సేవే మాధవసేవ సభ్యులు

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా ట్రూల్ చారిటబుల్ బాలల అనాథాశ్రమానికి నిత్యావసర సరకులు సోమవారం అందించారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వారికి అవసరమైన నిత్యావసర సరకులు ట్రస్టు వ్యవస్థాపకుడు అభిషేక్‌కు అందించారు.మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, అధ్యక్షుడు ఎస్.సీతారామకృష్ణ, ఉపాధ్యాయులు డి.వరప్రసాద్, పి.గిరిధర్, కార్యదర్శి వై.తిరుమూర్తి, కోశాధికారి కేవీ వర్మ, సంయుక్త కార్యదర్శులు పి.సంతోష్ కుమార్, పి.సతీష్ కుమార్, నిర్వహణ కార్యదర్శి బి.వెంకటేష్ పాల్గొన్నారు.

23న న్యూ డెమోక్రసీ పార్టీల విలీనం



జీవీఎంసీ గాంధీ పార్కులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సీతమ్మధార: విజయవాడలో రెండు న్యూ డెమోక్రసీ పార్టీల రాష్ట్రస్థాయి విలీన సభ ఈ నెల 23న జరగనుందని న్యూ డెమోక్రసీ విశాఖ, విజయనగరం ఏరియా కమిటీ అధికార ప్రతినిధి వై.కొండయ్య తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2013లో చీలికకు గురై రెండు న్యూ డెమోక్రసీ పార్టీలుగా రాష్ట్రంలో కార్యాచరణ సాగిస్తున్న పార్టీలు.. తిరిగి ఏకం కావాలని నిర్ణయించాయని వెల్లడించారు. అందుకు విజయవాడ వేదిక కానుందన్నారు. ఈ సానుకూల పరిణామాన్ని విప్లవ, ప్రజాస్వామిక శక్తులు, అస్తిత్వవాదులు బలపరచాలని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఎ.ఎస్.ఎస్.ఎస్ పూర్వ అధ్యక్షుడు కె.రవి, నగర కన్వీనర్ ఈ.లక్ష్మి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు డి.ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు కె.బాలనాగమ్మ పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు జై భీమ్‌నగర్‌లో కొలువై ఉన్న శ్రీ వినాయక, దత్తాత్రే, జ్ఞానసరస్వతిదేవి సహిత సంపత్ షిర్డీ ఆలయ 25వ వార్షికోత్సవం, శ్రీ జ్ఞానసరస్వతీ ఆలయ 10వ వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం జరిగిన పల్లకీ సేవలో స్వామి,అమ్మవార్లను ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు,పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ కమిటీ ప్రతినిధులు

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి 24వ వార్డులో గల నక్కవానిపాలెం గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి (ఏడు గుడులు) అమ్మవార్ల స్థలాన్ని ఆలయ ధర్మకర్తగా చెప్పుకుని ఓ వ్యక్తి ఆక్రమించాడని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు నక్కవానిపాలెం గ్రామ అధ్యక్షుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థలం చుట్టూ ప్రహరీ కట్టి 5 షాపులు నిర్మించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆక్రమదారుడ్ని ప్రశ్నిస్తే తమపై కేసులు పెడతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని గ్రామ కమిటీ అధ్యక్షులు గుడ్ల కాటరాజురెడ్డి, కార్యదర్శి కారపు శ్యామలరావు, కోశాధికారి ధర్మాల గురుమూర్తి రెడ్డి, వైస్. ప్రెసిడెంట్‌లు బోర రవికుమార్‌రెడ్డి ,వై. వెంకటేశ్వరరెడ్డి, జీఆయింట్ సెక్రటరీ నందిక వేణురెడ్డి,నక్కవానిపాలెం గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

కనుమూరుకు ప్రగతి చిత్ర అవార్డు



ప్రగతి చిత్ర అవార్డు అందుకుంటున్న చిత్రకారుడు కనుమూరు శ్రీనివాసరావు



శ్రీనివాసరావు గీసిన చిత్రం

సీతంపేట: ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్‌లో నగరానికి చెందిన చిత్రకారుడికి అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళలు, సాంస్కృతిక శాఖ సహకారంతో క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన 19వ జాతీయ చిత్ర కళా పోటీల్లో నగరానికి చెందిన చిత్రకారుడు కనుమూరు శ్రీనివాసరావు గీసిన జాగువర్ విత్ కళంకారి చిత్రానికి ప్రగతి చిత్ర అవార్డు సొంతం దక్కింది. ఆదివారం గుంటూరులో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, ప్రముఖ చిత్రకారుడు జి.వై.గిరి చేతులమీదుగా అవార్డును అందుకున్నారు.

భార్యను బెదిరించిన భర్తపై కేసు

మద్దిపాలెం: భార్యను బెదిరించిన భర్తపై కంచరపాలెంలో పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. తుమ్మడిపాలేనికి చెందిన గణేష్‌కు..బర్మాక్యాంపునకు చెందిన సుభాషిణితో ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వివాహం జరిగిన కొన్నేళ్ల తరువాత వీరిద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. భర్త పనిపాటాలేకుండా తిరుగుతుండడంతో పిల్లలను తీసుకుని బర్మాక్యాంపులో ఉంటున్న తన తల్లి వద్దకు సుభాషిణి వచ్చేసింది. నాటి నుంచి భార్యపై అనుమానంతో వేధిస్తూ..బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో ఆమె కంచరపాలెం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు స్పందించకపోవడంతో దిశ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏసీపీ పెంటారావు స్పందించి గణేష్‌పై వేధింపుల కేసు నమోదు చేశారు. కేసు వాపసు తీసుకోవాలని, లేదంటే చంపేస్తానని కత్తితో దాడి చేసేందుకు సోమవారం గణేష్ ప్రయత్నించగా..సుభాషిణి తల్లి అడ్డుకుంది. సుభాషిణి ఫోన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయగా..గణేష్ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న సుభాషిణి సోదరుడు కిరణ్ ..తన బావను నిలదీయడానికి ఊర్వశీ జంక్షన్ వెళ్లాడు. అయితే కిరణ్‌పై గతంలో రౌడీషీట్ ఉండేది. దీనిని ఆసరాగా చేసుకుని రౌడీషీటర్ కిరణ్ తనపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని సీపీకి గణేష్ ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. సీపీ ఆదేశాలతో కంచరపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దర్నీ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మొత్తం వ్యవహారంపై ఏఎస్ఐ రత్నం,సిబ్బందితో విచారణ జరిపారు. సీఐ రవికుమార్ నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారిణి సరోజినికి సత్కారం



సరోజినిని సత్కరిస్తున్న సత్యదేవ్

తాటిచెట్లపాలెం: జాతీయ క్రీడా పోటీలలో హ్యాట్రిక్ సాధించి సత్తా చాటిన కైలాసపురం శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చక దంపతులు దువ్వూరి రాజేశ్వర్రావు, జోగులాంబ దంపతుల కుమార్తె సరోజిని జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ ఘనంగా సత్కరించారు. ఇటీవల రాజస్థాన్‌లోని ఆళ్వార్‌లో జరిగిన ఇండియ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 క్రీడా పోటీల్లో పాల్గొన్న దువ్వూరి సరోజిని స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించింది. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సత్యదేవ్ ఆకాంక్షించారు.